బొగ్గు బంధం ముగిసినట్లే..!

- జనవరిలోగా కాలగర్భంలో కలిసిపోనున్న ఓసీపీ
- కార్మికుల సర్దుబాటుకు సింగరేణి సన్నాహాలు
- క్రమంగా ప్రాభవం కోల్పోతున్న 'రామకృష్ణాపూర్'

రామకృష్ణాపూర్ పట్టణ ఒక్కగానొక్క ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ కాలగర్భంలో కలిసిపోనుంది. వచ్చే జనవరి నాటికి ఈ ప్రాజెక్ట్‌ను కాస్త మూసివేస్తే.. బొగ్గు పెళ్లతో ఈ ప్రాంతానికి సంబంధం ఇక తెగదెంపులు అయినట్లే. గతంలో ఒక ఏరియా స్థాయి పరిధి కలిగి.. ఓ వెలుగు వెలిగిన రామకృష్ణాపూర్‌కు ఇక నామ రూపాల్లేని దౌర్భాగ్యకర దుస్థితి పట్టనుంది. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్‌ను మూసివేసే చర్యలకు యాజమాన్యం వివిధ కసరత్తులు చేస్తోంటే.. జాతీయ కార్మిక సంఘాల నాయకులమని చెప్పుకునే వారెవరూ ఉలకటం, పలకటం లేదు. కొన్ని సంవత్సరాలుగా ఒక్కో గని మూతపడుతూ క్రమక్రమంగా ప్రాభవం కోల్పోతున్నా, పట్టణం ఇక కొన ఊపిరితోనే కొట్టుమిట్టాడాల్సిన దుస్థితి దాపురిస్తోంది. మూసివేత నిర్ణయాన్నే అంతిమ లక్ష్యంగా పెట్టుకున్న ఉన్నతాధికారులు.. ఉన్న కార్మికుల సర్దుబాటు చర్యలు చేపట్టడానికే తహతహలాడుతున్న తరుణాన 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం. – రామకృష్ణాపూర్


ఆర్‌కేపీ ఓసీలో నిలిపి ఉన్న డంపర్లు(ఫైల్)

సింగరేణి సంస్థ చరిత్రలో ఒకప్పుడు రామకృష్ణాపూర్ ఒక ఏరియాగా వెలుగొందిన సంగతి తెల్సిందే. జనరల్ మేనేజర్ సహా ఏరియా స్థాయి కార్యాలయాలు కలిగి ఉన్న ఈ పట్టణంలో గత కొంతకాలం నుంచి ఒక్కో గనిని, డిపార్ట్‌మెంట్‌ను అధికారులు మూసివేస్తూ వస్తున్నారు. జనరల్ మేనేజర్ కార్యాలయం, స్టోర్స్, వర్క్‌షాపు, టింబర్‌యార్డు ఇలా ఒక్కో దానిని మూసివేశారు. చివరికి అరకొరగా పనిచేస్తూ వచ్చిన ఆర్‌కే1ఏ, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు మిగిలిపోయాయి. ఇప్పుడు వాటి పతనానికి మార్గం సుగమం అయింది. ఇది వరకే ఆర్‌కే1ఏ భూగర్భ గనిని మూసేసిన అధికారులు.. ఇప్పుడు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్‌కు మంగళం పాడేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. బొగ్గు నిక్షేపాలు లేవనే సాకుతో ప్రాజెక్టును పాతరేయాలని తుది నిర్ణయం తీసుకోవటం గమనార్హం. ఇదే జరిగితే ఇక పట్టణ మనుగడ ప్రశ్నార్థకమే. ఉనికి ఆందోళనకరమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జనవరిలోగా కాలగర్భంలోకి..!!

ఈ డిసెంబర్ వరకు ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టును నెట్టుకొచ్చి వచ్చే జనవరి నాటికి పూర్తిస్థాయిలో అధికారికంగా మూసివేయాలని అధికారులు తదనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం ప్రాజెక్టులో పనిచేస్తున్న సుమారు 350మంది కార్మికులను ఇతర ప్రాంతాలకు సర్దుబాటు చేయాలని భావిస్తున్నారు. ఇప్పటివరకు కార్మికుల అంశాన్ని ఊసెత్తనప్పటికీ అటు తరువాత చేపట్టేది ఈ ప్రక్రియేనని చెప్పకతప్పదు. ఎలాగైతే చడీచప్పుడు కాకుండా ఆర్‌కే1ఏ గనిని మూసివేశారో, ఇక ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుపై దృష్టి సారించారనటంలో ఎలాంటి సందేహం లేదు. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రక్రియతో కార్మిక సంఘాలకు ముకుతాడు వేయటంలో సఫలీకృతమైన సింగరేణి యాజమాన్యం అనుకున్నది అమలుచేయటంలో తనకు అడ్డంకులు లేకుండా చేసుకున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పట్టణ ప్రజల్లో ఆవేదన..

రామకృష్ణాపూర్‌కు సింగరేణి బొగ్గుపెళ్లతో ఉన్న బంధం ఇక తెగిపోయినట్లేనని ఆవేదన పట్టణ ప్రజల్లో వ్యక్తమవుతోంది. సంస్థ పరిధిలో ఒక ఏరియాగా వెలుగొంది విశేష సేవలందించిన పట్టణం పూర్తిగా ఉనికి కోల్పోయే ప్రమాదంలో పడడాన్ని ఎవ్వరూ జీర్ణించుకోలేకపోతున్నారు. కార్మికులే కాదు కార్మికేతరులు సైతం నేడు కలతచెందుతున్నారు. ఉపాధి అవకాశాలు మృగ్యమై బతుకుదెరువు భారం కావడంతో ఉబికివస్తున్న ఆవేదనను దిగమింగుకుని కాలం వెళ్లదీస్తూ వచ్చిన వారు.. ఇక తమ అస్తిత్వానికే ముప్పువాటిల్లుతుందని తల్లడిల్లిపోతున్నారు. అంతిమంగా ఆనవాళ్లు లేకుండా పోతున్న తమ పట్టణాన్ని ఎవరూ పట్టించుకునే ప్రయత్నం కూడా చేయకుండా పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం


భీమారం: వేడుకల్లో పాల్గొన్న ముదిరాజ్‌లు

భీమారం/దండేపల్లి/చెన్నూర్: ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ మత్స్యకార దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దండేపల్లి పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలో, భీమా రం, చెన్నూర్ ముదిరాజ్ సంఘం కార్యాలయాల్లో జెండా ఆవిష్కరించి, స్వీట్లు పంచిపెట్టారు. ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలని, మత్స్యకార్మికుల సమస్యలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లోని చెరువుల్లో చేపల పెంపకం మత్స్యకార్మికులుగా ఉన్న ముదిరాజ్‌లకే కేటాయించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ముదిరాజ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాధనబోయిన కృష్ణ, సంఘం నాయకులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన

చెన్నూర్: ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో గల ఆయుష్ యోగా కేంద్రంలో యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి రోజూ ఉదయం మహిళలు, పురుషులకు వేరువేరుగా ఉచితంగా తరగతులు నిర్వహిస్తున్నట్లు యోగా టీచర్లు మోర్ల మధూకర్, గాదె రజిత తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రేవెల్లి మహేశ్, బీజేపీ నాయకులు జాడి తిరుపతి, మేడ సురేశ్‌రెడ్డి, శివకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత యోగా తరగతులు

నెన్నెల: మండలంలోని స్థానిక పీహెచ్‌సీలో యూనాని డిస్పెన్సరీ ఆయూష్ ఆరోగ్య మందిరంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా గురువు కాచం ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 8గంటల వరకు యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

1న మాలల సింహగర్జన సభ


మాట్లాడుతున్న యాదగిరి

బెల్లంపల్లి: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా 1న హైదరాబాద్‌లో సింహగర్జన సభ నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు జాతీ య కార్యదర్శి కాసర్ల యాదగిరి తెలిపారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చే సిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సరికాదన్నారు. రిజర్వేషన్‌ను పెంచడానికి ఎస్సీలు కలిసికట్టుగా పోరాడాల్సి ఉందన్నారు. వర్గీకరణ వల్ల సమన్యాయం జరగదని పేర్కొన్నారు. సింహగర్జన సభకు మాలలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని, ప్రత్యేకంగా మంచిర్యాల జిల్లా నుంచి పెద్ద ఎత్తున జనసమీకరణ చేయాలని శ్రేణులకు పి లుపునిచ్చారు. సింహగర్జన సభకు చెన్నూర్, బె ల్లంపల్లి ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, వినోద్‌లు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో తెలంగాణ మాల మహా నాడు రాష్ట్ర నాయకుడు బద్దం వాసురాం, జి ల్లా నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని పాత బస్టాండ్ నుంచి మా ర్కెట్ రోడ్డు రామన్ కాలనీ వరకు ఇరువైపులా ఒకే విధంగా డ్రె యినేజీలు నిర్మించాల ని జనసేన పార్టీ నా యకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు గురువారం వినతిపత్రం అందించారు.

మురుగు కాలువలు శుభ్రం


పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో

సాక్షి ఎఫెక్ట్..

కోటపల్లి: మండలంలోని లింగన్నపేట గ్రామంలో మురుగు నీరు రోడ్లపై పారుతోందని, దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని ఈ నెల 20వ తేదీన 'దుర్వాసనతో అవస్థలు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. లింగన్నపేట, పార్‌పల్లి, ఎర్రాయిపేట గ్రా మాల్లో గురువారం ఎంపీడీవో సత్యనారాయణ పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. రోడ్లపై ము రుగు నీరు పారకుండా డ్రెయినేజీలు శుభ్రం చేయించారు. పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని, రోడ్లపై మురుగునీరు రాకుండా చూడాలని కార్యదర్శులను ఆదేశించారు.

షీ టీంపై అవగాహన

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని కేజీబీవీ పా ఠశాలలో విద్యార్థులకు షీ టీం పై షీటీం, సఖీ సెంటర్ సిబ్బంది అవగాహన కల్పించారు. రక్షణ, ర్యాగింగ్, గుడ్ టచ్–బ్యాడ్ టచ్, ఇతర వి వరాలపై పూర్తిస్థాయిలో వివరించారు. సైబర్ క్రైం, నేరాలపై జాగ్రత్తగా ఉండాలని తెలిపా రు. ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తే 1930, 100 నంబర్‌లకు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ అంజిబాబు, సతీష్, సిబ్బంది విజయ, పుష్పలత పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కార్యవర్గం

తాండూర్: మండల టీఎస్ యూటీఎఫ్ కమిటీ ఎన్నికలు గురువారం ఏకగ్రీవంగా జరిగాయి. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చక్రపాణి, రాజవేణు ఆధ్వర్యంలో మండల కమిటీ ఎన్నికలను నిర్వహించి నూతన కమిటీని ఎంపిక చేశారు. టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా బి.దేవదాస్, ఉపాధ్యక్షులుగా కె.ఖగపతి, పి.నాగచంద్రిక, కార్యదర్శులుగా జె.అశోక్, ఎస్.కళావతి, సీ.హెచ్.రాజేష్, పి.మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా జి.సంపత్, కోశాధికారిగా ఎస్.శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా శిరీష్‌కుమార్, సభ్యురాలిగా డి.పద్మ, మహిళ కమిటీ కన్వీనర్‌గా ఎస్.స్వప్న, సాంస్కృతిక కమిటీ కన్వీనర్‌గా మనీషా, వీవోటీటీ కన్వీనర్‌గా ఎం.లింగయ్య, ఎఫ్‌డబ్ల్యూఫ్ కన్వీనర్‌గా ఎ.చంద్రశేఖర్ ఎంపికైనట్లు జిల్లా నాయకత్వం ప్రకటించింది.

బీజేపీ గ్రామ అధ్యక్ష ఎన్నికలు

కోటపల్లి: మండలంలోని కొల్లూర్ గ్రామంలో గురువారం బీజేపీ గ్రామ అధ్యక్ష ఎన్నికలను బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు పురుషోత్తం అధ్వర్యంలో నిర్వహించారు. 228వ బూత్ అధ్యక్షురాలిగా తాదురి రజిత, జనరల్ సెక్రటరీగా అప్పాల సౌందర్య నుంచి నామినేషన్ స్వీకరించినట్లు తెలిపారు.

వరిలో నాణ్యతా ప్రమాణాలపై అవగాహన

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం వరిలో నాణ్యతా ప్రమాణాలపై ఏవో యామిని రైతులకు అవగాహన కల్పించారు. హార్వెస్టర్‌తో వరి కోత కోసే సమయంలో ఆర్పీఎం 18గా ఉండాలని తెలిపారు. సేంద్రీయ వ్యవసాయం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు సాగర్, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో స్వయంపాలన వేడుకలు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులై ఒక్కరోజు తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

మంచిర్యాలకు తరలిన నాయకులు

దండేపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మంత్రుల సభకు దండేపల్లి, హాజీపూర్ నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

ధాన్యం కొనుగోలు పారదర్శకంగా ఉండాలి

జన్నారం: వడ్ల కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, ఎటువంటి ఫిర్యాదులు లేకుండా నిర్వహించాలని తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం వారితో చర్చించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో ఏవో సంగీత, ఏపీఎం బుచ్చన్న, ఆర్ఐ భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎల్లక్కపేట, లంబడిపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను గురువారం ఎంఈవో రాధాకృష్ణమూర్తి పరిశీలించారు. హాజరు శాతం, రిజిస్టర్లను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని తెలిపారు. విద్యార్థుల సామర్థ్యాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన తీరు ఎలా ఉందో పిల్లలను అడిగి తెలుసుకున్నారు.

చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్ట్

నస్పూర్: జనవిజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయి పిలుపు మేరకు నస్పూర్ మండలంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో గురువారం చెకుముఖి సైన్స్ టెస్ట్ నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో మండలానికి చెందిన 14పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు బత్తిని దేవన్న, నస్పూర్ మండల ఎంఈవో దామోదర్ ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. ఈ పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నస్పూర్ ట్రస్మా మండల అధ్యక్షులు మైదం రామకృష్ణ, సెక్రటరీ ఊట్ల సత్యనారాయణ, కోశాధికారి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఆమన్ ప్రసాద్, ప్రిన్సిపల్ రజిని పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కాసిపేట: బెల్లంపల్లి మండలం సోమగూడెం గ్రామ పంచాయతీలో గురువారం షాపింగ్ కాంప్లెక్స్ సమీపంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు.

గ్రంథాలయం ప్రారంభం

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయాన్ని గురువారం మండల విద్యాధికారి వెంకటేశ్వరస్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో కాసిపేట, ధర్మరావుపేట, దేవాపూర్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఓసీపీలో బీసీ కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న బీసీ కమిటీ నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని వద్ద జరిగిన సమావేశంలో బీసీ నాయకులు ఎస్కే బాజీ సైదా, మోతుకూరి కొమురయ్య, మారుతి, బద్రి బుచ్చయ్య ఆధ్వర్యంలో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా గండి సతీశ్, కో కన్వీనర్‌గా వీర్ల మదన్‌లు ఎన్నికయ్యారు.

వెంటనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలి

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో కారుణ్య ఉద్యోగాలు పొందిన వారిని వెంటనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరబద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచీకార్యదర్శి షేక్ బాజీసైదా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 27న శ్రీరాంపూర్‌లో కారుణ్య ఉద్యోగ నియామకపత్రాలను సంబంధిత అభ్యర్థులకు అందించి, వారికి వీటీసీలో ఒక రోజు శిక్షణ ఇచ్చి తిరిగి నియామక పత్రాలను వెనక్కు తీసుకున్నారన్నారు. ఈ నియామక పత్రాలను ప్రభుత్వ పెద్దల సమక్షంలో ఇప్పించి, తామిప్పించామనే ప్రచారం చేసుకోవడానికి వీటిని నిలుపుదల చేశారన్నారు. దీని వల్ల సరైన సమయంలో ఉద్యోగాల్లో చేరక, వారు సర్వీసులో వెనుకడే ప్రమాదం ఉందన్నారు. వెంటనే నియామక పత్రాలు ఇచ్చి శిక్షణ అందించి విధుల్లోకి పంపాలని డిమాండ్ చేశారు.

అంతర్గత ఖాళీల భర్తీకి పరీక్షలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో ఖాళీగా ఉన్న టిండాల్, టిండాల్ సూపర్‌వైజర్, రోప్ స్ప్లైసర్ భర్తీకి అంతర్గత ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించారు. ఏరియా వర్క్‌షాప్‌లో గురువారం వీటికి సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవి, డీవైపీఎం రాజేశ్వర్‌రావులు పాల్గొన్నారు.

శాంతిఖని గనిపై గేట్‌మీటింగ్


మాట్లాడుతున్న బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్

బెల్లంపల్లి: శాంతిఖని గనిపై గురువారం గేట్‌మీటింగ్ నిర్వహించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, జిల్లా సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య హాజరయ్యారు. గని నుంచి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెంచడానికి చర్యలు తీసుకోకుండా సింగరేణి అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నట్లు విమర్శించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రెటరీ దాసరి తిరుపతి గౌడ్, గని పిట్టుల సెక్రెటరీలు, కార్మికులు పాల్గొన్నారు.

ఎస్టేట్ జీఎంకు సన్మానం


రాధాకృష్ణను సన్మానిస్తున్న ఏరియా అధికారులు

శ్రీరాంపూర్: సింగరేణి ఎస్టేట్స్ జీఎం రాధాకృష్ణ ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటి సారిగా శ్రీరాంపూర్‌కు వచ్చిన సందర్భంగా ఏరియా అధికారులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా ఇన్‌చార్జి జీఎం టీ శ్రీనివాస్, ఇందారం ఓసీపీ పీవో ఏవీ రెడ్డి, ఎస్‌వో టుజీఎం సత్యనారాయణ, ఫైనాన్స్ ఏజీఎం మురళీధర్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏరియా ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, బెల్లంపల్లి ఎస్టేట్స్ మేనేజర్ మహేశ్‌కుమార్ పాల్గొన్నారు.

బొగ్గుబ్లాక్‌ల వేలం నిలిపివేయాలి


కాసిపేట: సంతకాల సేకరణలో సీపీఎం నాయకులు

బెల్లంపల్లి/కాసిపేట: బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బెల్లంపల్లి కాంటా చౌరస్తా వద్ద, కాసిపేట మండలం సోమగూడెంలో గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. బొగ్గుబ్లాక్‌ల వేలం బేషరతుగా నిలిపివేసి, ప్రైవేటీకరణ యత్నాలు రద్దు చేసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలతో తిప్పి కొట్టాలని సూచించారు. సింగరేణి ని కాపాడుకుంటేనే రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దక్కుతాయని తెలిపారు. సంతకాల సేకరణకు కాసిపేటలో ఆటో యూనియన్ నాయకులు, వ్యాపారులు మద్దతు ప్రకటించారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్, సీపీఎం బెల్లంపల్లి ఏరియా కార్యదర్శి జి.అశోక్, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

పాతమంచిర్యాల: సింగరేణి సంస్థకే బొగ్గుబ్లాకులు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. ప్రజల అభిప్రాయాలు సేకరించారు. ఇప్పటికే అనేక భూగర్భ గనులు మూసివేయడంతో వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆరోపించారు. సింగరేణి సంస్థ మనుగడ సాగించాలంటే, నూతన బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే అప్పగించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ప్రేంకుమార్, దూర్కె మోహన్ పాల్గొన్నారు.

శంకర్‌పల్లి.. సమస్యల లొల్లి..!

- కంకరతేలిన రోడ్లు, అసంపూర్తిగా జీపీ భవనం
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పాలవాగుపై వంతెన నిర్మించాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు


శంకర్‌పల్లికి వెళ్లే మార్గంలో కంకరతేలిన రోడ్డు

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని శంకర్‌పల్లి జీపీ గత ఎన్నికల ముందు నూతన గ్రామపంచాయతీగా ఏర్పడింది. మందమర్రికి సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి ఈ జీపీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. ఎన్నికల ముందు వచ్చి అన్ని సమస్యలు తీరుస్తామని చెప్పిన నాయకులు, గెలిచిన తర్వాత ఒక్కసారి కూడా రాలేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటివరకు ఆ గ్రామాన్ని ఒక్క ప్రజాప్రతినిధి కూడా సందర్శించ లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కంకరరోడ్డుతో తిప్పలు..

శంకర్‌పల్లి, సండ్రోన్‌పల్లి గ్రామాలు కలిపి శంకరపల్లి గ్రామ పంచాయతీ ఏర్పాటైంది. జీపీలో సుమారు 540మంది జనాబా ఉన్నారు. ఈ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాలంటే రెండు దారులున్నాయి. కేకే–5 గని పక్క నుంచి వెళ్తే రెండున్నర కిలో మీటర్లు, సండ్రోన్‌పల్లి మీదుగా వెళ్తే ఆరు కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఈ రెండు రోడ్లు కూడా కంకర తేలి అధ్వానంగా ఉన్నాయి. రోడ్లపై ప్రయాణించాలంటే ప్రయాణికులు జంకుతున్నారు. అనేక మార్లు ఎమ్మెల్యేలకు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

వంతెన నిర్మించాలని డిమాండ్..

శంకర్‌పల్లి నుంచి మండల కేంద్రానికి వెళ్లే దారిలో పాలవాగు ఉంటుంది. వర్షాకాలంలో ఆ వాగు నుంచి మందమర్రి వెళ్లాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. వాగుపై బ్రిడ్జి నిర్మించాలని గత ప్రభుత్వ ఎమ్మెల్యేకు, ప్రస్తుత ఎమ్మెల్యే వివేక్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గ్రామస్తులంతా చందాలు సేకరించి సుమారు రూ.లక్షా నలభై వేలతో తాత్కాలికంగా పైపులతో వంతెన నిర్మించుకున్నప్పటికి అది సౌకర్యంగా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి పాలవాగుపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.

అసంపూర్తిగా జీపీ భవనం..


అసంపూర్తిగా జీపీ భవనం

నూతనంగా ఏర్పాటైన శంకరపల్లి గ్రామపంచాయతీకి కార్యాలయ భవనం లేకపోవడంతో కొన్ని సంవత్సరాలు అద్దె ఇంటిలో కార్యకలాపాలు కొనసాగాయి. ఇటీవల సుమారు రూ.22లక్షల వ్యయంతో నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది తీర్మానంతో రూ.12లక్షలతో పనులు చేసినా, నిధులు మంజూరు కాకపోవడంతో అర్ధంతరంగా నిలిపివేశారు. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న భవనం నుంచే కార్యాకలాపాలు కొనసాగిస్తున్నారు. జీపీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.


సమస్యలు పరిష్కరించండి



కంకర రోడ్డుపై మండల కేంద్రానికి వెళ్లాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోంది. వాహనాలు కింద పడి గాయాలపాలవుతున్నాం. జీపీ భవనం లేకపోవడంతో గ్రామసభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి ఇబ్బంది అవుతోంది. నిధులు మంజూరు చేసి భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి. పాలవాగుపై బ్రిడ్జి నిర్మించాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా మా సమస్యలు పరిష్కరించాలి.

– జుమ్మిడి బుచ్చయ్య, శంకర్‌పల్లి, గ్రామస్తుడు

నిధుల మంజూరుకు కృషి



పాలవాగుపై చేపట్టే బ్రిడ్జి విషయం పై ఉన్నతాధికారులకు తెలియజేశాం. గ్రామస్తులు రూ.లక్షయాభై వేలు సేకరించుకోగా, ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. ఎనభై వేలు తాత్కాలిక వంతెన ఏర్పాట్లకు కేటాయించాం. కాంట్రాక్టర్‌ను నూతన జీపీ భవన నిర్మాణానికి సంబంధించిన పనుల వివరాలను తెలియజేయాలని చెప్పాం. వివరాలు తెలియజేయగానే బిల్లుల మంజూరు గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తా.

– రాజేశ్వర్, ఎంపీడీవో, మందమర్రి

సుద్దాల రోడ్డుకు మరమ్మతులు


ట్రాక్టర్‌తో రోడ్డు చదును చేస్తూ..

భీమారం: మండలంలోని లాల్‌బహదూర్‌పేట నుంచి చెన్నూర్ మండలం సుద్దాల వరకు గల మట్టి రోడ్డుకు గురువారం మరమ్మతులు పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే వివేక్ సూచన మేరకు జిల్లా కాంగ్రెస్ నాయకులు చేకూర్తి సత్యనారాయణరెడ్డి తన సొంత ఖర్చులతో పనులు చేపట్టారు.

ఘనంగా డీసీసీ అధ్యక్షురాలి జన్మదిన వేడుకలు


హాజీపూర్‌లో పూస్కూరి శిల్ప నివాస గృహంలో...

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ జన్మదిన వేడుకలను మాజీ జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. హాజీపూర్, కర్ణమామిడి, టీకానపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు వేడుకలు నిర్వహించారు.

అన్నదానం

నస్పూర్: పట్టణంలోని ఆర్కే 5 కాలనీలోని శ్రీ సాయి వృద్ధాశ్రమంలో గురువారం ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. రవి, లక్ష్మయ్య, మొగిలి తదితరులు పాల్గొన్నారు.